ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్ జిల్లా వార్తలు
3
ఆదివారం 15 సెప్టెంబరు 2024



కల్వల ప్రాజెక్ట్ మరమ్మతులు పూర్తి చేస్తాం

వీణవంక, సెప్టెంబర్ 14: కల్వల ప్రాజెక్ట్ మరమ్మతులు త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సాయంత్రం కార్యకర్తలతో కలిసి టీ తాగారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. పలువురు రైతులు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో మండలానికి మళ్లీ వస్తానని సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. త్వరలోనే కల్వల ప్రాజెక్టు పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు సంగీతం శ్రీనివాస్, నల్ల కొండల్‌రెడ్డి, శీలం సురేందర్‌రెడ్డి, సాహెబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



వీణవంకలో ప్రజల సమస్యలను వింటున్న మంత్రి

శోభాయాత్రలో డీజే, బాణాసంచాపై నిషేధం

● పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 14: గణేష్ నిమజ్జన శోభాయాత్రలో డీజే, బాణాసంచాపై నిషేధం ఉన్నట్లు పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి పేర్కొన్నారు. నిమజ్జన కేంద్రాలైన మానకొండూరు చెరువు, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చేపట్టనున్నట్లు తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తులు ఎటువంటి ఆయుధాల ప్రదర్శన, ఇతరులను గాయపరిచే వస్తువులు వెంట ఉంచుకోరాదని, విద్వేషపూరిత నినాదాలు, ప్రసంగాలు చేయడం, పాటల వినియోగం వంటి చర్యలకు పాల్పడరాదని తెలిపారు. ఈ నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమ్మజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని సీపీ సూచించారు.





విద్యారంగ సమస్యలపై ఉద్యమం

● ప్రజాస్వామ్య విలువలను ప్రభుత్వాలు కాపాడాలి
● యూఎస్ఎఫ్ఐ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి

సుభాష్‌నగర్, సెప్టెంబర్14: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలు చేపడుతామని యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, మాదం తిరుపతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం పేరుతో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రీకరణ చేయాలని కుట్ర చేస్తోందని అన్నారు. దీనిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యారంగంలో ప్రజాస్వామ్య విలువలను ప్రభుత్వాలు కాపాడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను మార్కెట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం పరీ క్షల నిర్వహణలో విఫలం అయ్యిందని అన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యారంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. గత ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించడం వల్ల ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా గత పాలకుల లాగానే వ్యవహరిస్తుందన్నారు. యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించకుండా ఇన్‌చార్జి వీసీలను నియమిస్తోందన్నారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్స్, గురుకులాలకు పక్కా భవనాలను నిర్మించాలని, విద్యార్థినిలపై దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉప్పుల రాహుల్, కార్యదర్శి నంద గణేష్, ఉపాధ్యక్షుడు మాలోతు రాకేష్ నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమార్, ఉమామహేశ్వర్, హరీష్, గణేష్, మణి, రామ్, కీర్తన, నీలిమ, అభిలాష్, సతీష్, స్పందన, సింధు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, సెప్టెంబరు 14: తెలంగాణ పంచా యతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్ జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహిం చారు. జిల్లా అధ్యక్షునిగా గోదారి అజయ్‌కుమార్, కార్యదర్శిగా బుక్యా రమేశ్, అసోసియేట్ అధ్యక్షునిగా సుష్మితరెడ్డి, కోశాధికారిగా అబ్దుల్ వాహిజ్, ఉపాధ్యక్షులుగా పవన్‌సాయి, మధుమితరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మీసా మల్లిఖార్జున్, పబ్లిసిటి కార్య దర్శి గా రాజేశ్, ఈసీ మెంబర్లుగా రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, మమతరెడ్డి, రవి, సుష్మ, చంద్రశేఖర్‌లను ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు అజ య్‌కుమార్, రమేశ్ మాట్లాడుతూ ఈ ఎన్నికలకు సహకరించిన టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీని వాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, ఎంపి వోల సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టీఎ న్‌జీవో సంఘం సహకారంతో పంచాయతీ కార్యద ర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ముగిసిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 14: స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీలకు జిల్లా నలు మూలల నుంచి దాదాపు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో అత్యంత ప్రతిభ కనబరిచిన 30 మంది క్రీడాకారులను ఈ నెల 19,20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శి టీలో జరిగే రాష్ట్ర పోటీలకు పంపిస్తామని జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఈ పోటీల నిర్వహ ణలో జిల్లా అతిథి అసోసియేషన్ సభ్యుడు రాజగోపాలాచారి, హరికిషన్, ఎం.చంద్రశేఖర్, గౌతమ్, అథ్లెటిక్స్ శిక్షకులు తిరుపతి, వరుణ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో అర్బన్ బ్యాంకు

● సేవలపై విస్తృత ప్రచారంతో మరిన్ని లాభాలు గడించాలి
● జిల్లా సహకార అధికారి ఎస్.రామానుజాచార్య



అర్బన్ మహాజన సభ సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో రామానుజాచార్యులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 14: ఖాతాదారులకు, సభ్యులకు మెరుగైన సేవలందిస్తూ గత ఐదేళ్లుగా కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపించడం అభినందనీయమని జిల్లా సహకార అధికారి, బ్యాంకు పర్సన్ ఇంచార్జి మెంబర్ ఎస్.రామానుజాచార్య అన్నారు. శనివారం నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బ్యాంకు మహాజన సభకు డీసీవో అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులు తమ సేవలను విస్తృత పరుస్తూ అన్నివర్గాల ప్రజల మన్ననలను అందుకుంటున్నాయని అన్నారు. అయితే అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు, సభ్యులకు అందిస్తున్న సేవలపై ప్రచారం చేసుకుంటూ మరిన్ని లాభాలను గడిస్తూ ముందుకెళ్లాలని సూచించారు. బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులను గమ నిస్తూ రిజర్వుబ్యాంకు, సహకార రంగ చట్టాలకు లోబడి బ్యాంకు సేవలుండాలంటూ పలు సూచనలు చేశారు. బ్యాంకులో బో గస్ సభ్యత్వాలున్నట్లు ఆరోపణల దృష్ట్యా ప్రత్యేకాధికారిని నియమించి వాటిని తొలగిస్తామని తెలిపారు. బ్యాంకు మాజీ చైర్మన్ ముద్దసాని కనుకయ్య బ్యాంకు అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడుతూ ఆయన కుమారుడు క్రాంతికి ఆత్మీ య జ్ఞాపికను అందజేశారు. బ్యాంకు అసోసియేట్ అధ్యక్షుడు గడ్డం విలాస్‌రెడ్డి సభ్యత్వాలన్నిటికి ఆధార్‌కార్డులను అనుసంధానం చేయాలని, గత పాలకవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు డివిజన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఆమో దం తెలిపారు. సమావేశంలో సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, మహ్మద్ ఖలీమ్‌ఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మి, ఎ.విద్యాసాగర్, ఇ.లక్ష్మన్‌రాజు, ఎండి.సంయుద్దీన్, బ్యాంకు సీఈవో నునుగొండ శ్రీనివాస్, ఎలుక సుధా కర్, సభ్యు లు ముప్పిడి సునీల్, ఆది మల్లేశం పటేల్, కల్యా డపు ఆగయ్య, తోట ఆగయ్య, మంచాల సుధాకర్, చల్ల జనార్ధన్, బాబుల వర్మ, పలువురు మాజీడైరెక్టర్లు,సభ్యుల పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి ఆకస్మిక మృతి

● అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



5లో

గణేశ్ నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం

● మేయర్ సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 14: నగరంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసినట్లు నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఇంజ నీరింగ్, సానిటేషన్, ఇతర విభాగాల అధికారులను ఇంచార్జీలుగా నియమించినట్లు చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మూడు పాయింట్లను గుర్తించి అక్కడ భారీగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. తొమ్మిది రోజుల పాటు ఘనంగా పూజించబడిన గణేశ్ విగ్రహాలను సోమవారం ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలని నిర్వహకులను కోరారు. మానకొండూర్, కొత్తపల్లి చెరువు, చింతకుంట ఎస్సారెస్పీ కెనాల్ వద్ద నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మానకొండూర్ పాయింట్ వద్ద డీఈ లచ్చిరెడ్డి, ఇంచార్జి డీఈ అయూబ్‌ఖాన్, ఇద్దరు వర్క్ఇన్‌స్పెక్టర్లు, కొత్తపల్లి పాయింట్ వద్ద డీఈ టి.శ్రీనివాస్, ఏఈ గఫూర్, ఇద్దరు వర్క్ఇన్‌స్పెక్టర్లు, చింతకుంట కెనాల్ పాయింట్ వద్ద ఏఈ గంగాధర్, ఏఈ సతీష్, ఇద్దరు వర్క్ఇన్‌స్పెక్టర్లకు ఇంచార్జీ బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. గణేశ్ శోభాయాత్ర సందర్భంగా టవర్ సర్కిల్ పాయింట్ వద్ద డీఈ ఓం ప్రకాశ్, వర్క్ఇన్‌స్పెక్టర్ సాయి, అన్ని ప్రాంతాలకు ఇంచార్జీగా ఈఈ రొడ్డ యాదగిరి, రాజ్‌కుమార్‌లకు బాధ్యతలను అప్పగించామని అన్నారు. పారిశుధ్య నిర్వహణకు అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, సానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్‌లకు ఇంచార్జి బాధ్యతలను అప్పగించామని చెప్పారు.




సీతారాం ఏచూరికి కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

భగత్‌నగర్, సెప్టెంబరు 14: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి కరీంనగర్‌లో సీపీఎం నాయకులు కొవ్వత్తులతో నివాళులులర్పించారు. శని వారం సాయంత్రం బస్టాండ్ చౌరస్తా నుంచి తెలంగాణచౌక్ వరకు కొవ్వత్తులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ సీపీఎం కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ భారత రాజకీయ పోరాట యోధుడిని కోల్పోవడం తీవ్రదిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకే కాకుండా భారతదేశ రాజకీయాలకు పేద ప్రజలకు తీరని లోటన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో సంస్మరణ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గీట్ల ముకుందరెడ్డి, సత్యం, బీమాసాహెబ్, సంపత్, రమేష్, నరేష్, సారంగపాణి, నాగమణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు తక్కువ ధరకే కరెంటు మీటర్

● బీపీఎల్ కుటుంబాలకు అవకాశం ● ఈ నెల 16వరకు దరఖాస్తుల స్వీకరణ



కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 14: నిరుపేదలకు తక్కువ ధరకు విద్యుత్ మీటర్ మంజూరు చేసేందుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. సొంత ఇల్లు ఉన్నా, విద్యుత్ సౌకర్యం లేని నిరుపేద కుటుంబాలకు ఈ అవకా శాన్ని కల్పించింది. అయితే ఈ నెల 1వ తేదీ నుంచి విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామాల్లో మీటర్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తులకు ఈ నెల 16వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉంది. ఆదివారం సెలవు, సోమవారం వినాయక నిమజ్జనం కారణంగా మరిన్ని రోజులు గడువు తేదీ పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ మీటర్ పొందాలంటే సాధారణంగా గ్రామాల్లో 3,330 రూపాయలు, పట్టణాల్లో 5వేల వరకు మీసేవ కేంద్రాల్లో చెల్లించి సంబంధిత పత్రాలను విద్యుత్ శాఖ అధికారులకు ఇస్తే వాటిని పరిశీలించి విద్యుత్ మీటర్ బిగిస్తారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ విద్యుత్‌ను కొందరు అక్రమంగా వినియోగిస్తున్నారు. బీపీఎల్ కుటుంబాలు గృహ జ్యోతి పథకంలో లబ్ధి పొందడానికి వీలుగా తక్కువ ధరకు మీటర్లను మంజూరు చేస్తున్నారు. 250 వాట్ల సామర్థ్యం విద్యుత్ కోసం కేవలం 825రూపాయలు, 500 వాట్ల కోసం 938 చెల్లించి రశీదు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 16వ తేదీ వరకు బీపీఎల్ కుటుంబాలు దరఖాస్తు చేసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ప్రభుత్వం ఈ నెల 17 నుంచి రెండో విడత ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టగా, గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను వాడుకునే అవకాశం కల్పించింది. కొత్తగా విద్యుత్ మీటర్ల పొందిన పేదలకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే ఉచిత విద్యుత్‌వర్తింప జేయనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

WANTED
★ సాయి PVT. ITI జగిత్యాలలో Instructor గా పనిచేయుటకు దిగువవారు కావలెను. B.Tech/Diploma-Electrical & Machanical, MCA and MBA పై యొక్క Bio-Data తేది: 25-09-2024 లోగా saiiti1992@gmail.com కు పంపగలరు. సంప్రదించండి. సెల్: 81063 71128
AJK-201570

TO-LET
★ COMMERCIAL SHOPPINGMALL, 9000 SFT G+2 FLOORS, HANUMANDLA HIGHTS, NEAR VEGETABLE MARKET, MOCHI BAZAR, JAGTIAL. CELL : 99085 22321
AJK-197447

WANTED
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పేషెంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 25K. క్వాలిఫికేషన్ : ఏదీ డిగ్రీ. ఫోన్ : 8977547749
AJH-002655

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640
జగిత్యాల :- సెల్ : 99854 11262
మెట్‌పల్లి :- సెల్ : 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

జిల్లా ప్రజలకు ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు



















పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

చొప్పదండి, సెప్టెంబరు 14: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డు ఎల్లయ్య శుక్రవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా డయల్ 100కి ఒక వ్యక్తి ఫోన్ చేసి ముగ్గురు అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నారని ఫిర్యాదు చేశాడు. ఇద్దరు పోలీసులు గుమ్లాపూర్ వాహనంలో వెళ్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు ఎదురు కాగా గ్రామస్థులు తమను దొంగలు అనుకొని వెంటపడితే బైక్ వదిలిపెట్టి నడుచు కుంటూ వస్తున్నామని తెలిపారు. వారిద్దరిని వాహనంలో తీసుకొని గుమ్లాపూర్‌కి వెళ్లారు. అక్కడ మోటార్ సైకిల్ ఉండగా అదే సమయానికి అక్కడ కొందరు వ్యక్తులు పోలీసు లతో గొ డవకు దిగారు. అక్కడ ఉన్న కోలాపురి విజయ్ అనే వ్యక్తి పోలీసులతో దురుసుగా మా ట్లాడుతూ జీపులో ఉన్న వారిని మాకు అప్పగించాలని పోలీసులను నెట్టివేశాడు. గొడవ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోలపురి విజయ్ మీద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తేలుకాటుకు పారిశుధ్య కార్మికుడి దుర్మరణం



నల్లూరి కళ్యాణ్(ఫైల్)

ఓదెల/ఫ్లైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 14: నిత్యం చెత్తకుప్పల మధ్య పని చేసే పారిశుధ్య కార్మికులకు గాయాలు కావడం మామూలే. అలా పని చేస్తున్న క్రమంలో తేలు కాటుకు గురై సాధారణ గాయంగా భావించి నిర్లక్ష్యం చేశాడా కార్మికుడు. విషం శరీరమంతా వ్యాపించిన తరవాత ఆస్పత్రికి వెళ్లినా ప్రయోజనం లేక పోయింది. నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి చివరకు ప్రాణాలు కోల్పోయాడు. వివారాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లికి చెందిన నల్లూరి కళ్యాణ్ (26) రామగుండం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. 8ఇంక్లైన్ దగ్గరలో ఉన్న వెంకట్రావు పల్లి లో బుధవారం చెత్తను తొలగిస్తున్న క్రమంలో చేతికి గాయమైంది. చెత్తలో ఉన్న ఏదో వస్తువు తగిలిందని భావించి తన పని తాను చేసుకుంటూ పోయాడు. కొది సేపటికి అతని ఆరోగ్యం విషమించడంతో చెత్తలో ఉన్న తేలు కాటు వేసినట్లు తోటి కార్మికులు గుర్తించారు. గోదావరిఖని ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా విష ప్రభావం గుండె, మెదడు వంటి శరీర అవయవాలపై చూపుతోందని గుర్తించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రెండు రోజులుగా వైద్య చికిత్సలు చేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. చివరకు శనివారం కల్యాణ్ మృతి చెందాడు. తేలు కాటును వెంటనే గుర్తించి సకాలంలో వైద్యం అంది ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని తోటి కార్మికులు వాపోతున్నారు. మృతునికి భార్య, కుమారుడున్నారు.

19 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 14: మండలంలోని మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు. తెల్లవారుజామున సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తూ వాహనాలు తనిఖీ చేయగా తాడికల్ గ్రామానికి చెందిన నరాల అంకూస్ ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 19క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. అంకూస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 14: మండలంలోని తుమ్మన్నపల్లి గ్రామానికి చెందిన గొడిశాల సదానందం అనే ఆర్‌ఎంపీ డాక్టర్ శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చెల్పూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరోక ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో సదానందంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జీల పర్శరాములు ట్రాక్టర్‌లో మానేరు నుంచి జమ్మికుంటకు తరలిస్తుండగా కేసు నమోదు చేశారు.

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద బెజ్జంకి మండలం దేవక్కపల్లి నుంచి అను మతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోపెట్రోలింగ్ చేస్తుండగా శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ముగ్గురు వద్ద నుంచి 41,000 రూపాయల విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమెదు చేసినట్లు పేర్కొన్నారు. కొర్కల్ లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నా అంబరగొండ శ్రీనివాస్ నుంచి 7,530 రూపాయల విలువ గల మద్యం, చల్లూరులో గర్వందుల శివకృష్ణ నుంచి 32,260 రూపాయల విలువ ఉన్న, కొత్తపల్లిలో బొడిపల్లి కోటేశ్వర్ నుంచి 11,150 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి




















గల్ఫ్ బోర్డు, ఎన్ఆర్ఐ పాలసీపై ముందడుగు

- హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి పొన్నం- హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే, గల్ఫ్ ప్రభావిత ప్రాంతాల నేతలు



సమావేశం నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ఎన్ఆర్ఐ పాలసీపై ప్రభుత్వం ముందడుగు వేసి పలు కసరత్తులు నిర్వహిస్తోంది. శనివారం హైద్రాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కన్వీనర్‌గా గల్ఫ్ కార్మికుల సంక్షేమం కొరకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు అందుబాటులో ఉన్న గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, నాయకులు, గల్ఫ్ వలసల నిపుణులు, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభయ హస్తం ఎన్నికల మేనిఫెస్టోలో 'గల్ఫ్ కార్మికులు, ఎన్ఆర్ఐల సంక్షేమం' పేరుతో ఇచ్చిన నాలుగు హామీల అమలుకు అవసరమైన పలు కసరత్తులను సమావేశంలో నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వర్ధన్నపేట, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు నాగరాజు, భూపతిరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, సుంకెట అన్వేష్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రీహరి రావు, వెలిచాల రాజేందర్, వలస నిపుణులు అంబాసిడర్ వినోద్ కుమార్, గల్ఫ్ వలస కార్మిక నాయకులు మంద భీంరెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కథల్లో

మనిషి జీవించే హక్కులు

- కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని - 'కరీంనగర్ కథలు' సంకలనం ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 14 : సాహిత్యానికి పుట్టినిల్లుగా ఉన్న కరీంనగర్ ప్రాంతంలోని కవులు, రచయితుల రాసిన కథల్లో మనిషి జీవించే హక్కులు కనిపిస్తున్నాయని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ అచార్య సి.మృణాళిని అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్‌లో కరీంనగర్ కథల సంకలనం పరిచయసభ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని, ప్రసిద్ధ కథా రచయిత అల్లం రాజయ్య, ప్రొఫెసర్ కాశీం, కథా సంకలనం సంపాదక వర్గం రచయితలు జూకంటి జగన్నాథం, డాక్టర్ నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్‌కుమార్, కరీంనగర్ కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచార్య మృణాళిని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో క్రీస్తుకు పూర్వం నుంచి ప్రజల బాషలో అనేక కథలు వచ్చాయన్నారు. ప్రజల బాషలో సాహిత్యం తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిందన్నారు. అనేక చారిత్రక పరిణామాలకు మనిషి జీవించే హక్కు కోసం తపించిన కథలు కరీంనగర్ కథల్లో కనిపిస్తు న్నాయన్నారు. కరీంనగర్ కథల్లో ప్రచురిం చిన ప్రతీ కథలు ప్రజల హక్కులను చూపిస్తున్నాయన్నారు. ఆ కథల్లో కవులు, రచయితలు రచించిన మా



సిరిసిల్లలో కరీంగనర్ కథల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

దిరిగానే ప్రజలు తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. ప్రముఖ రచయిత అల్లం రాజయ్య మాట్లాడుతూ శతాబ్దం యుద్ధ విషాదాలనుంచి ఇక్కడ సమాజం సంఘర్షణ పడుతూనే ఉందన్నారు. 90 సంవత్సరాల కథలను సంకలనంగా కరీంనగర్ కథలను తీసుకరావడం హర్షనీయమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ కాళోజీ సంకలనంలో కథలు, సాహిత్యంలో వ్యాపార సంస్కృతి ప్రబలిపోతున్న కాలంలో నిశ్శబ్ధంగా నిలబడ్డాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రంగినేని మోహన్‌రావు, రంగినేని నవీన్‌కుమార్, కవులు, రచయితలు బెజ్జారపు రవీందర్, బెజ్జారపు వినోద్‌కుమార్, అమర్, ఆడెపు లక్ష్మీపతి, రాజిరెడ్డి, దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, ఎల గోండ రవి, ఆడెపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం మీదికి తెచ్చిన రీల్స్ సరదా

- గూడ్స్ రైలెక్కి యువకుడి ఫొటోలు

- విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు

కాజీపేట, సెప్టెంబరు 14: రీల్స్ సరదా పిచ్చి ముదురుతోంది. ఈ సరదాలో పడి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. కాజీపేటలో ఓ యువకుడు గూడ్స్ రైలు బోగి ఎక్కి రీల్స్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన రాజు అనే యువకుడు శనివారం కడిపికొండలో ఓ చర్చిలో జరగుతున్న కార్యక్రమానికి హాజరయ్యాడు. కార్యక్రమం జరుగుతుండగా సమీపంలోని రాంనగర్‌లో నిలిపి ఉన్న రైలు బోగీ ఎక్కి సెల్‌ఫోన్‌లో రీల్స్ చేస్తున్నాడు. ఈ క్రమంలో రైలుపై ఉన్న హైటెన్షన్ కరెంట్ తీగలు రాజును లాగిపడేశాయి. దీంతో కరెంట్ షాక్‌కు గురైన రాజు తీవ్రగాయాలతో బోగీ నుంచి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు.. 108కు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన 108 మెడికల్ టెక్నీషియన్ లింగాల శివకుమార్, పైలట్ కుంట రవిలు ఘటనాస్థలికి చేరుకుని ఎమర్జెన్సీ చికిత్స చేసి ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనలో రాజు 70 శాతం శరీరం కాలిపోయిందని ఎంజీఎం వైద్యులు తెలిపారు. స్పృహ కోల్పోయిన రాజు కుటుంబ వివరాలు తెలియాల్సి వుంది.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

గొల్లపల్లి, సెప్టెంబరు 14: దీర్ఘకాలంగా రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ధర్మారం మండల కేంద్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సెక్యూరిటీ గార్డులు శనివారం వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీలలో 1994 సంవత్సరం నుంచి ఇప్పటివరు సెక్యూరిటీ గార్డులుగా 1200 మంది నియమితులై దాదాపు 27 సంవత్సరాలుగా మార్కెట్ కమిటీకి సేవలు చేస్తున్నామని, ఏజెన్సీ విధానం రద్దు చేస్తూ తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ నిధుల నుంచి జీతభత్యాలు చెల్లిస్తున్నందున సర్వీస్ రెగ్యులర్ చేయడం వలన ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి భారం పడదని, అనుబంధంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరి సర్వీస్‌ను రెగ్యులర్ చేశారని, వారిలాగే తమ సర్వీస్‌ను కూడా రెగ్యులర్ చేసి మా బతుకుల్లో వెలుగులు నింపి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, బొల్లం మల్లేశం, ముంజ సతీష్ గౌడ్, కిషన్ రావు, జూపాక కుమార స్వామి, జనార్దన్, హైమద్ చందు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



నృసింహుడిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 14: ధర్మపురి క్షేత్రంలో బాద్రపద మాసం ఏకాదశి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజా టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

● లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ కుటుంబ సమేతంగా సందర్శించారు. వేద పండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆల య ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.

తుమ్మేటి సమ్మిరెడ్డి ఆకస్మిక మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

జమ్మికుంట, సెప్టెంబరు 14: జమ్మికుంటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి (59) గుండెపోటుతో శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మాత్తుగా మృతి చెందారు. గుండెపోటుకు గురైన సమ్మిరెడ్డిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుడి నుంచి ఎదిగి రెండు పర్యాయాలు జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. కాగా తుమ్మేటి సమ్మిరెడ్డి మరణ వార్త విన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తన కార్యక్రమాలను వాయిదా వేసుకోని హైదరాబాద్ నుంచి హుటాహుటిన జమ్మికుంటకు వచ్చారు. సమ్మిరెడ్డి భౌతికఖాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమ్మిరెడ్డి కుమారుడిని పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు, యుప్‌టీవి సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, ప్రజా ప్రతినిధులు, ప్రముఖ రాజకీయ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్
తుమ్మేటి సమ్మిరెడ్డి (ఫైల్) (ఇన్‌సెట్‌లో)

సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పునరుద్ధరించండి

గిత్యాల అర్బన్, సెప్టెంబరు 14: జగిత్యాల నియోజకవర్గంలోని బీర్‌పూర్ మండలంలో ఉమ్మడి రాష్ట్రంలో నెలకొల్పబడిన సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004-2009 సంవత్సరానికి సంబంధించి మండలంలో ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా నిమిత్తం ఈ స్కీం ఏర్పాటు చేయబడిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ తాగునీటి సరఫరాకు సంబంధించి మిషన్ భగీరథ పథకాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా శుద్ధనీటిని సరఫరా చేస్తామని ప్రకటించి సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పక్కనపెట్టారన్నారు. అటు భగీరథ నీరుఅందక, ఇటు సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్లక్ష్యానికి గురికావడంతో మండల ప్రజలు తాగునీటికోసం వాటర్ ప్లాంట్‌ల వద్ద కొనుగోలు చేసుకుని తాగే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాయికల్, జగిత్యాల మండలాల్లో రాపిడ్ స్టాండ్ ఫిల్టర్ నీటి శుద్ధి కేంద్రాల మాదిరిగానే ఇప్పుడున్న 2ఎంఎల్‌డీ ఎస్ఎస్ఎఫ్ స్థానంలో 5ఎంఎల్‌డీ ఆర్ఎస్ఎఫ్ నీటి శుద్ధి కేంద్రం నిర్మించి, బీర్‌పూర్ మండలంలోని 34 గ్రామాలకు తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. కావున బీర్‌పూర్ మండలంలోని సీపీడబ్ల్యూఎస్ పథకాల పునరుద్ధరణకు సంబంధించి రూ.800లక్షలతో అంచనాలు రూపొందించామని, గ్రామీణ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రివైజ్డ్ అంచనాలకు అనుగుణంగా సంభందిత అంచనా నిధులు మంజూరు చేయాలని కోరారు.

గురుకుల ఉపాధ్యాయుల పనివేళలు మార్చాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 14: గురుకుల ఉపాధ్యాయుల పని వేళలను మార్చాలని యూటీఎఫ్ ఎంజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివిన్‌స్టన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలు, కళాశాలలను సందర్శించి యూటీఎఫ్ సభ్యత్వ నమోదు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల ప్రిన్సిపాల్స్, జేఎల్స్, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని, హెల్త్‌కార్డులు మంజూరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్ట్స్, క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్స్, స్టాఫ్‌నర్స్ ప్రమోషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కుమార్, జావేద్, సభ్యులు సురేశ్‌కుమార్, జాన్సన్, హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సెక్యూరిటీ గార్డ్‌పై లైంగిక వేధింపులు

- షీ టీమ్‌కు సమాచారం ఇచ్చిన బాధితురాలు- రెండు నెలల్లో రెండో ఘటన



రామగుండం మెడికల్ కళాశాల ముఖద్వారం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 14: సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్)లో మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపుల ఘటన మరొకటి వెలుగు చూసింది. సిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న మహిళపై సెక్యూరిటీ సూపర్‌వైజర్ గాదె సుధాకర్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అతని వేధింపులు భరించలేక బాధితురాలు షీ టీమ్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో షీటీమ్ బాధితురాలి నుంచి వివరాలు సేకరించింది. ఘటనపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితురాలు మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తోంది. సుధాకర్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. నిత్యం నానా రకాలుగా బాధితురాలిని లైంగికంగా వేధిస్తుండడంతో ఆమె ప్రిన్సిపాల్ దృష్టికి కూడా తీసుకెళ్లింది. ప్రవర్తన మారకపోవడంతో షీటీమ్‌ను ఆశ్రయించింది. జూలైలో ఇదే కళాశాలలో ఒక సూపర్‌వైజర్ పారిశుద్య విభాగంలో పని చేస్తున్న కార్మికురాలిని లైంగికంగా వేధించిన ఘటన చోటు చేసుకుంది. అతన్ని విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. రెండు నెలల్లోనే సిమ్స్‌లో రెండో ఘటన వెలుగుచూడడం గమనార్హం. గోదావరిఖని సింగరేణి మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీగా ఉన్న సంస్థ నిర్వహణ విషయంలో మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తుందనే ఆరో పణలు ఉన్నాయి. పని స్థలాల్లో మహిళా కార్మికులకు రక్ష ణ, వేధింపులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సంబంధిత ఏజెన్సీదే. ఒక ఘటన జరిగిన తరువాతనైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇవేమి చేపట్టకుండా నిర్వహణను గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి.

పరస్పరదాడులు .. కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 14: పట్టణంలోని జిల్లా ఆసుపత్రి సమీపంలో వస్త్రదుకాణం ఎదుట వాహనం పార్కింగ్ ఘర్షణకు దారితీసింది. శుక్రవారం పట్టణంలో వస్త్ర దుకాణం ఎదుట కైలాస్ అనే వ్యక్తి కారు పార్క్ చేశాడు. దుకాణం ఎదుట కారు పార్క్ చేయడంతో తొలగించాలని వ్యాపారి శ్రీనివాస్ సూచించాడు. ఎందుకు తీయాలంటూ ప్రశ్నించడంతో పరస్ప రదాడులకు దారి తీసింది. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు వారు ఫిర్యాదు చేశారు. కారు యజమాని కైలాస్‌పై, వస్త్రదుకాణం యజమాని శ్రీనివాస్, అతడి కుమారుడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

విష జ్వరంతో విద్యార్థిని మృతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 14: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మైదంశెట్టి నక్షత్రహాసిని (14) అనే విద్యార్థిని విష జ్వరంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నక్షత్రహాసిని స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. మూడు రోజుల కిందట జ్వరం బారిన పడడంతో విద్యార్థినికి మండల కేంద్రంలోని పీఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయింది. నక్షత్రహాసిని తండ్రి ఉద్యోగ రీత్యా ఎల్లారెడ్డి పేటలో ఉంటున్నప్పటికీ వారి స్వగ్రామం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం కావడంతో మృతదేహాన్ని అక్కడికి తరలించారు.



నక్షత్రహాసిని(ఫైల్)

కుక్కల స్వైర విహారం

- దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు

- గ్రామస్థుల భయాందోళన



కరీంనగర్‌లో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు
(ఇన్‌సెట్‌లో గాయపడ్డ చిన్నారి)

మంథని, సెప్టెంబరు 14: గ్రామాల్లో వీధి కుక్కలు రెచ్చిపోయి జనం మీద పడి విచ్చలవిడిగా దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. మండలంలోని స్వర్ణపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో శనివారం కుక్క స్వైర విహారం చేస్తూ దాడులు చేయడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్వర్ణపల్లి గ్రామంలో తమ ఇంటి ముం దు ఆడుకుంటున్న నలుబోతుల మానసశ్రీ, కొరవేన వేదాన్స్‌పటేల్ పై, మరో వ్యక్తిపై కుక్కలు విచక్షణరహితంగా దాడి చేశాయి. దీంతో చిన్నారులిద్దరికి పలు చోట్ల తీవ్రంగా గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు, రక్తస్రావం అధికం కావడంతో చిన్నారుల, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గాయపడ్డ చిన్నారులను చికిత్స కోసం కుటుంబ సభ్యులు మంథనికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గడ్డం మల్లేష్‌తోపాటు అతడి కూతురు శ్రావ్యపై ఇదే కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత స్వర్ణపల్లి గ్రామంలో పలువురిపై దాడి చేసిన కుక్కను గ్రామస్థులు తరిమివేశారు. పక్కనే ఉన్న వెంకటాపూర్‌కు చేరుకొని తండ్రి కూతురు పై దాడి చేసింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు పిచ్చకుక్కను చంపి వేశారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను పుట్ట మధు కోరారు. ఇటీవల గ్రామాల్లో యథేచ్ఛగా సంచరిస్తున్న వీధి కుక్కలు చిన్నారులు, అందరి పై దాడులు చేస్తుండటంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కల దాడుల నుంచి రక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో అరకొర వైద్య సేవలు

- ›› సెలవుల్లో వైద్యాధికారి
- ›› పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత
- ›› సగానికి పైగా గ్రామాల్లో మొదటి ఏఎన్ఎంలు లైని వైనం
- ›› సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు

మల్యాల, సెప్టెంబరు 14: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యశాఖ పేర్కొంటున్నప్పటికీ వైద్యులు, వైద్య సిబ్బంది కొరతతో గ్రామాల్లో ప్రజలకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలతో మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాల్సి ఉండగా సగం గ్రామాల్లో ఏఎన్ఎంల కొరత నెలకొంది. దానికి తోడు పల్లె దవాఖానాలో వైద్యులు లేకపోగా మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, మండల వైద్యాధికారి సెలవులో వెళ్లారు. దీంతో గ్రామాల్లో వైద్య సేవల పర్యవేక్షణ అంతంత మాత్రమే సాగుతున్నట్లు తెలుస్తుంది. నెల రోజులుగా గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతుండగా మల్యాలలోని పీహెచ్‌సీకి నిత్యం వందకు పైగా రోగులు వస్తున్నారు. ఈ క్రమంలో వైద్యుల కొరత వైద్య సేవలకు అంతరాయంగా మారుతోంది. దీంతో గ్రామాల్లోని ప్రజలు జగిత్యాల లాంటి పట్టణాలకు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెలుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి

అంతరాయం లేకుండా వైద్య సేవలు

వైద్యురాలు సెలవులో ఉన్నప్పటికీ పల్లె దవాఖాన వైద్యులతో రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించడం జరుగుతుంది. గ్రామాల్లో ఇద్దరేసి ఏఎన్ఎంలు ఉంటుండగా ఖాళీలు ఉన్న చోట్ల ఒకరు విధుల్లో ఉంటున్నారు. వైద్యుల కొరత దృష్ట్యా పల్లె దవాఖానాల్లో ఖాళీలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రత్యామ్నయంగా వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

- సమీయోద్దీన్, డీఎంహెచ్‌వో

● వైద్యులు లేని పల్లె దవాఖాలు

గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలను మరింత అందుబాటులోకి తేవడంతో పాటు పెద్ద ఆసుపత్రి సేవలను అందించడానికి ఏర్పాటు చేసిన పల్లె దావాఖాల్లో వైద్యుల కొరత నెలకొంది. మండలంలో పోతారం, రాంపూర్, మ్యాడంపల్లి, తక్కళ్లపల్లి, నూకపల్లి గ్రామాల్లో పల్లెదవాఖానాలు ఉండగా తక్కళ్లపల్లి, నూకపల్లిలో వైద్యులు లేరు. ఉన్న ముగ్గురు పల్లె దవాఖాన వైద్యులే మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు.తక్కళ్లపల్లిలో స్టాఫ్ నర్స్ ఆధ్వర్యంలో పల్లె దవాఖాన కొనసాగుతుంది. ఇక ఇంటింటికి అందుబాటులో ఉంటూ నిత్యం వైద్య సేవలు అందించే స్టాఫ్ నర్సులు మండల వ్యాప్తంగా 8మంది ఉండగా రాంపూర్, తాటిపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి గ్రామాల్లో లేరు. దీంతో రెండవ ఏఎన్ఎం, ఆశ వర్కర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. మండల వైద్యాధికారి మౌనిక సెలవులో ఉండగా ప్రాథమిక ఆసుపత్రి పరిధిలో ఒక్క ఆరోగ్య పర్యవేక్షణ అధికారి పోస్టు కూడా ఖాళీ ఉంది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండగట్టులో అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే శాలువ



అగ్గిపెట్టెలో పట్టె శాలువ అందజేస్తున్న విజయ్

మల్యాల, సెప్టెంబరు 14: సిరిసిల్లాకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ కొండగట్టు ఆంజనేయస్వామికి అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువను అందజేశాడు. శనివారం కుటుంబసమేతంగా అంజన్న సన్నిధికి వచ్చిన విజయ్‌కుమార్ స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అధికారులకు పట్టు శాలువను అందజేశారు. ఈ సం దర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ధర్మేంధర్ తదితరులు ఉన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీ లోకి 27,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 27,315 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

'తుమ్మేటి' మృతికి పలువురి సంతాపం

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్, సెప్టెంబరు 14: కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, పార్టీ మీడియా సెల్ కన్వీనర్‌గా సమ్మిరెడ్డి సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించారని తెలిపారు.

● తుమ్మేటి సమ్మిరెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు.

●కరీంనగర్ టౌన్: తుమ్మేటి సమ్మిరెడ్డి మృతి పట్ల మాజీ ఎంపీ, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

'మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం'

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు14: మహమ్మద్ ప్రవక్త బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సున్నీ మర్కజి మిలాద్‌కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి అన్నారు. నగరంలోని ఎంఐఎం కార్యాలయంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా రబివుల్అవ్వల్ మాసం సందర్భంగా దరూద్ షరీఫ్, నాత్‌కి మహిఫిల్ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని సున్ని మర్కజి మీలాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధనలు భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రెటరీ హఫీజ్ యూసుఫ్, ఆతిన, కార్పోరేటర్లు ఫిరోజ్ అఖిల్, శర్ఫుద్దీన్, ఇబ్రహీం, బియబాని, మౌలానా ఖయ్యుం జియాయి, మౌలానా అబుల్ కలాం, అయ్యుబ్‌ఖాన్, హబీబ్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

పద్య రచనపై ఆసక్తి పెంచుకోవాలి



రాఘవీయ స్మృతి సంచికను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు14: పద్య రచనపై కవులు ఆసక్తిని పెంచుకోవాలని ప్రముఖ సాహితీవేత్త గంగ్ర లక్ష్మణ్‌రావు అన్నారు. శనివారం నగరంలోని సిద్ధార్థ పాఠశాలలో ఆయన కుటుంబ సభ్యుల సంపాదకీయంలో వచ్చిన రాఘవీయ స్మృతి సంచికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తిశేషులు గోవర్ధన రాఘవాచార్యులు పండిత జీవితం స్ఫూర్తిదాయకమని ప్రముఖ సాహితీవేత్త గంగ్ర లక్ష్మణ్‌రావు అన్నారు. రాఘవాచర్యులు గురించి నవ సాహితీ ప్రియులకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. వారి జీవిత కాల పాండిత్య సేవలను ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. పద్య రచనపై నేటి కవులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణమాచార్యులు, గోవర్ధన వెంకటశేషాచార్యులు, దబ్బేట రాజారామ్ మోహన్, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, పారమిత చైర్మన్ ప్రసాద్‌రావు, జగిత్యాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్ తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్, సముద్రాల వేణుగోపాలాచార్యులు, నీలగిరి అనిత ఆముక్తమాల్యద, రేగులపాటి విజయలక్ష్మి, కాండూరి వెంకటేశ్వర్లు, గంగుల శ్రీకర్, విలాసారం రవీందర్, దామెరగుంట శంకరయ్య, సివికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్, సెప్టెంబరు 14: నిరుద్యోగులకు సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వస్తున్నానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గతంలో నాలుగు జిల్లాల్లో కేవలం 1.20లక్షల మంది మాత్రమే ఓటర్ నమోదు చేసుకు న్నారన్నారు. ఈ సారి 10లక్షలకు పైగా పట్టభద్రులు ఓటర్ నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నా రన్నారు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే పోటీ చేస్తానని, ఒకవేళ టికెట్ రాకున్న స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. సేవాభావంతోనే రాజకీయాల్లోకి వస్తున్నానన్నారు. సమావేశంలో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యాసంస్థల చైర్మన్‌కు సన్మానం

గంగాధర, సెప్టెంబరు 14: మండల కేంద్రానికి చెందిన వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ పి లక్ష్మారెడ్డి బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డును అందుకోవడంతో పలువురు సన్మానించారు. శనివారం ఆల్ ఇండియా ప్రైవేటు స్కూల్ అసోసియేషన్, రాష్ట్ర ట్రస్మా ఆధ్వర్యంలో హైదరా బాద్‌లో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యారంగంలో 35 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న లక్ష్మారెడ్డిని జాతీయ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ఈసందర్భంగా అవార్డు అందుకున్న లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తనకు అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా జగన్



నియామకపత్రాన్ని అందుకుంటున్న పుల్లెల జగన్

గన్నేరువరం, సెప్టెంబరు 14: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పుల్లెల జగన్ నియామకం అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్య శనివారం తనకు నియామకపత్రాన్ని అందజేసినట్లు జగన్ తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన జాజుల శ్రీనివాస్, నాగుల కనుకయ్యలకు పుల్లెల జగన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రులకు హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తా

-మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 14: పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఒక్క రూపాయికే ప్రతి పట్టభద్రుడికి హెల్త్, ఆక్సిడెంట్ ఇన్సూరెన్సు పాలసీ చేయిస్తానని మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. శనివారం నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి మద్దతు కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల్లో జరిగే కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్నానని చెప్పారు. పట్టభద్రులు ఏళ్ళ తరబడి అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పట్టభద్రులకు ఒక ప్రతినిధిగా శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకగా నిలిచి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈనెల 30 నుంచి పట్టభద్రులంతా ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని రవీందర్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, గొట్టం మహేశ్, పొన్నం అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్





వేడుకల్లో పాల్గొన్న పారడైజ్, సెయింట్ జార్జ్ విద్యార్థులు, శంకరపట్నంలో హిందీ అక్షరాల రూపంలో విద్యార్థులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 14: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల ఆధ్వర్యంలో హిందీలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేసినట్లు కళాశాల హిందీ అధ్యాపకుడు ఎల్.కనకయ్య తెలిపారు. ఈసందర్భంగా హిందీ భాషను ప్రచారం చేస్తూ హిందీ వికాసానికి దోహదపడుతున్న ఎండి ఉమర్ అలీ, ఎండి.జలీల్, ఉపాధ్యాయులను సన్మానించారు.

●నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యాసరచన పోటీలు, పోస్టర్ తయారీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈకార్యక్రమంలో పార మిత చైర్మన్ ప్రసాద్‌రావు, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, అనూకర్‌రావు, వినోద్‌రావు, టిఎస్‌వి రమణ, హన్మంతరావు, వియుఎం ప్రసాద్ పాల్గొన్నారు.

●కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

●భగత్‌నగర్: రేకుర్తి, కొత్తపల్లిలోని పారడైజ్, సెయింట్ జార్జ్ విద్యాసంస్థల్లో శనివారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెయింట్‌జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి వేడుకలను ప్రారంభించి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో జాతి ప్రజలను ఏకం చేసిన భాష హిందీ భాషఅన్నారు. మన దేశంలో కొన్నిరాష్ట్రాల్లో హిందీ అధికార భాషగా ఉందన్నారు. భారతీయ సంస్కృతికి ఆత్మలాంటిది హిందీ భాష అన్నారు. దేశంలో ఆరవై శాతం మంది హిందీ మాట్లాడుతున్నారన్నారు. ఈ సందర్భంగా భాష గొప్ప తనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టివసంత, భార్గవ్, నిరంజన్, వైస్‌ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●శంకరపట్నం: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థుల కు హిందీ అక్షరాల రూపంలో కూర్చొబెట్టారు. ఉపాధ్యా యులు జాతీయ భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

గంగాధర: గంగాదర మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో హింది దివస్ కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ వారుణి హింది భాష ప్రచారానికి ముఖ్యమైన రోజని, దేశ సాంస్కృతిక ఐక్యతను చాటుతుందని విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

'క్షణికావేశంతో ఆత్మహత్యలు చేసుకోవద్దు'

భగత్‌నగర్, సెప్టెంబరు14: జీవితం దేవుడిచ్చిన వరమని క్షణికా వేశంలో అంతం చేసుకోవద్దని తెలంగాణ సైకాలసిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎఱ్ఱా మల్లేశం అన్నారు. శనివారం రేకుర్తిలోని సాన్వికళాశాలలో ప్రపం ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురవుతాయని సమయ స్ఫూర్తి ఆత్మస్థయిర్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యావంతులు, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న వారు సైతం ఒత్తిడితో క్షనికావేశానికి గురవు తున్నారన్నారు. ఆత్మహత్యలకు పాల్పడే వారు 15నుంచి 29 సంవత్సరాల వయసు వారు కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గాలిపల్లినాగేశ్వర్, కళాశాల కరస్పాండెంట్ మునీందర్, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ ఎస్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అల్ఫోర్స్ లియో క్లబ్ సభ్యులు

భగత్‌నగర్, సెప్టెంబరు14: నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో లియో క్లబ్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ లతీష్‌రెడ్డి మాట్లా డుతూ అనుకోని ప్రమాదం జరిగినపుడు వ్యక్తి ప్రాణాలను నిలపడానికి ఆసుపత్రికి చేర్చే క్రమంలో సత్వరం చేయాల్సిన ప్రక్రియను వివరించారు. కార్యక్రమంలో లయన్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, లయన్ సత్యనారాయణరావు పాల్గొన్నారు.

●కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని వివేకా నంద డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారిని కెప్టెన్ కే.కిరణ్ జ్యోతి, ఏవో బి.శ్రావణ్ కుమార్, ఎన్‌సీసీ కెడేట్లు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు





తీగలగుట్టపల్లిలో దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు, విద్యానగర్‌లో కరెన్సీ నోట్లతో వినాయకుడి అలంకరణ

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 14: కరీంనగర్ మండలంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా శనివారం ఆయా మండపాల్లో దీపోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తీగలగుట్టపల్లిలోని సరస్వతీ నగర్‌లోని డెవలప్ మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పటిష్ఠించిన వినాయక మండపంలో కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఓ శోభారాణి, కాలనీ వాసులు పాల్గొన్నారు. బొమ్మకల్ గ్రామంలోని వినాయకనగర్ వినాయక యూత్ ఆధ్వర్యంలో దీపారాధన, పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నగునూర్ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మండపం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

●**కరీంనగర్ కల్చరల్:** నగరంలోని పలు వినాయక మండపాల్లో మేయర్ సునీల్‌రావు శనివారం పూజలు చేసి అన్నదానాల్లో పాల్గొన్నారు. 33వ డివిజన్ ఆదర్శయూత్ క్లబ్, భజరంగదళ్ యూత్ క్లబ్, మహాదేవ యూత్‌క్లబ్, ఫండస్‌స్కూల్, 53వ డివిజన్, గోదాంగడ్డ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో మేయర్ సునీల్‌రావు పూజలు జరిపి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లతో పాటు డివిజన్ వాసులు పాల్గొన్నారు.

●నగరంలోని విద్యానగర్ ప్యారిస్‌లైన్‌లో వినాయకుడిని 35.60లక్షల కరెన్సీతో అలంకరించారు. శ్రీఉమాపుత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్ర, శని, ఆదివారం 35.60 లక్షల రూపాయలతో ప్రత్యేక అంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోట సతీష్‌కుమార్, ఉమాపుత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

●**గణేష్‌నగర్:** నగరంలోని 37వ డివిజన్‌లో శ్రీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో లక్ష్మారెడ్డి, పురెళ్ల వెంకటేష్, మహేందర్, అనిల్, వరాల దేవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, సెప్టెంబరు 14: గణేష్ నిమజ్జనాన్ని ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మానకొండూర్‌లోని పెద్ద చెరువు వద్ద శనివారం నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానకొండూర్ చెరువులో మండల కేంద్రంలోని విగ్రహాలతో పాటు ముంజంపల్లి, శ్రీనివాస్‌నగర్, కరీంనగర్‌కు చెందిన వందలాది విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టకు ఇరువైపులా బారీకేడ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. చెరువు వద్ద గజ ఈతగాళ్లు, విద్యుత్, టెంట్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కట్టపై రెండు బారీ క్రేన్లు, హనుమాన్ దేవాలయం వద్ద చిన్న క్రేనును ఏర్పాటు చేస్తామని చెప్పారు. అధికారులు సమన్వయంతో నిమజ్జనం ప్రశాంతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, వివిధ శాఖల అధికారులతో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఓదెలు, వైస్ చైర్మన్ ఆర్ తిరుమల్‌రెడ్డి, కొత్తకొండ శంకర్, టి సంపత్‌గౌడ్, కోండ్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా ఎల్ఎండీ

తిమ్మాపూర్, సెప్టెంబరు14: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నిండుకుండలా మారింది. ప్రస్తుతం 24.034 టీఎంసీలకు గానూ 23.947 టీఎంసీలకు చేరుకుంది. మోయతుమ్మెద వాగు నుంచి 179 క్యూసెక్కులు, ఎగువ మానేరు జలాశయం నుంచి 630 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా ఎల్ఎండీలో చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు అవుట్ ఫ్లో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అన్నదానం, కుంకుమ పూజలు

తిమ్మాపూర్, సెప్టెంబరు14: మండలంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపాల వద్ద పలుచోట్ల శనివారం అన్నదానం, కుంకుమ పూజలు నిర్వహించారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో శ్రీ రామాలయం, అంబేద్కర్ యువజన సంఘం వారు ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రామ్ అతడి సోదరుడు పోలు రమేశ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మన్నెంపల్లి గ్రామంలో వినాయక మండపం వద్ద రావుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

గీత కార్మికులకు శిక్షణ

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 14: జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామంలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన 54మంది గీత కార్మికులకు ఎక్సైజ్ సీఐ మాధవిలత ఆధ్వర్యంలో కాటమయ్య కిట్టుపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య కిట్ల ద్వారా శిక్షణ కార్యక్రమం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనంలో స్వచ్ఛందంగా పాల్గొనాలి

చొప్పదండి, సెప్టెంబరు 14: సామూహిక గణేశ్ నిమజ్జనంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు పడకంటి కృష్ణ కోరారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో శనివారం గణేశ్ నిమజ్జనోత్సవ కరపత్రా న్ని విడుదల చేశారు. సోమవారం మధ్యాహ్నం 2గంటల నుం చి తెలంగాణ చౌరస్తా వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థా ప్రముఖ్ చేపూరి సత్యనారాయణ, హిందూ ఉత్సవ సమితి కన్వీనర్ ఎన్నం మునీందర్, నాయకులు దండె లింగన్న, సిరిపురం శ్రీనివాస్, దండె సత్యానందం, చెట్టిపెల్లి కిషన్, దండె మహేష్, చల్ల అనూష్, రొడ్డవేని రాజు, చిలుకునూరి లక్ష్మిరాజం, కొత్తపల్లి శ్రీనివాస్, కొక్కు ల ప్రణీత్, మామిడాల రమణ, పంజాల గంగయ్య, ఇప్పనపెల్లి కొమురయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వింధ్యావాలి పాఠశాలలో గ్రీన్ డే

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 14: నగరంలోని మెహర్‌నగర్‌లోగల వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ ప్రాథమిక స్థాయి విద్యార్థిని, విద్యార్థులు గ్రీన్ డే సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆకుపచ్చని దుస్తులు ధరించి, ఆకుపచ్చని బెలూన్లను చేతపట్టుకొని వివిధ రకాలైన ఆకులు, ఫలాలు, ఆకుపచ్చని చిత్రాలను తయారు చేసి పరిసరాలను మరిపింపచేశారు. పర్యావరణ పరిరక్షణ, హరితహారంపై పిల్లల్లో అవగాహనకల్పించడానికి ఈ గ్రీన్ డే ఎంతో దోహదపడుతుంది. ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, వాటి బాధ్యత తీసుకొని పర్యావరణాన్ని ఆకుపచ్చగా మార్చడంలో తోడ్పడాలన్న ఉద్దేశాన్ని విద్యార్థుల్లో కలిగించడానిక ఈ గ్రీన్ డే ఎంతో అవగాహన కలిగిస్తుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ రామవరం లక్ష్మిప్రకాశ్‌రావు, వైస్ చైర్మెన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ ప్రదానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 14: నగరంలోని పలు ఆలయాల ఈవో గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన నాగారపు శ్రీనివాస్‌కు జనకళ వేముల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జీనియస్‌బుక్ ఆఫ్‌రికార్డు ఇంటర్నేషనల్ సర్టిఫికేట్ ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో శ్రీ సుబ్బ రాయ కళావేదికలో వినాయక దసరా ఉత్సవాల్లో భాగంగా సర్టిఫి కేట్‌ను అందించారు. సర్టిఫికేట్ అందుకున్న శ్రీనివాస్‌ను వివేకానంద హైస్కూల్ అధినేత సొగాని కొమురయ్య సత్కరించారు.

నిమజ్జన శోభాయాత్రకు మేయర్‌కు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 14: కరీంనగర్‌లో సోమవారం టవర్‌సర్కిల్ నుంచి జరిగే వినాయక మూర్తుల నిమజ్జన శోభాయాత్రకు రావాల్సిందిగా మేయర్ సునీల్‌రావుకు హిందూ ఉత్సవ సమితి, విశ్వ హిందూ పరిషత్ పక్షాన ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి, విహెచ్‌పి నాయకులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 14: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో బెజ్జంకికి చెందిన బూరుగు శ్రీలత అనే ప్రయాణికురాలు తన పర్సును పోగొట్టుకోగా ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు భద్రంగా అప్పగించారు. శనివారం శ్రీలత బస్టాండ్‌లోకి వెళుతున్న సమయంలో సెంటర్ గేట్ వద్ద తన పర్సును పోగొట్టుకుంది. వెంటనే సెక్యూరిటీ ఏఎస్ఐ ఎం.లక్‌పతి, కానిస్టేబుళ్లు జీఎల్ నారాయణ, రమణ, సెక్యూరిటీ గార్డులు తిరుపతి, ప్రభాకర్‌లకు సమాచారం అందించగా సెక్యూరిటీ పోలీసులు పర్సును వెదికి భద్రంగా ఆమెకు అప్పగిం చారు. పర్సులో 2వేల రూపాయలతో పాటు బ్యాంక్ డెబిట్ కార్డులు ఉన్నట్లు సెక్యూరిటీ పోలీసులు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 14: కరీంనగర్ బొమ్మకల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 320 జి లయన్ చింతల కిషన్ పటేల్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు నిర్వహించారు. కరీంనగర్ మండలం నల్లగుంటపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి ఓదమ్మతో పాటు పలువురికి రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సుసరేష్ సహకారంతో ఉచిత శాస్త్ర చికిత్సలు నిర్వహించారు. కంటి ఆపరేషన్‌లు చేయించుకున్న వారికిబ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు14: పాఠశాలలో స్కూల్ ఎన్నికల నిర్వహణ కార్యక్రమంతో విద్యార్థులకు రాజకీయ అవగాహన కలుగుతుందని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఉప్పు లింగయ్య అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ ఎన్నికలను నిర్వహించారు. విద్యార్థులు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులుగా పోటీ చేయగా హైస్కూల్ విద్యార్థులు బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు.

వినాయక మండపం వద్ద ఒగ్గు కథ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 14: నగరంలోని శివాజీనగర్‌లో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం ఒగ్గు కథను చెప్పించారు. కార్యక్రమంలో కళాకారులతో పాటు, నిర్వాహకులు పాల్గొన్నారు.

తిరుపతికి బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డు

భగత్‌నగర్, సెప్టెంబరు 14: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లోని సరస్వతి విద్యావిహార్ హైస్కూల్ కరస్పాండెంట్ గాజుల తిరుపతి బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్, డిజిటల్ శాటిలైట్, ట్రస్మా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవంలో గాజుల తిరుపతిని బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డుతో సత్కరించారు. విద్యారంగంలో విశేష సేవలందించిన కరస్పాండెంట్లను అవార్డులతో సత్కరించారు. ఆల్ ఇండియా ఆర్గనైజర్ సోమశేఖర్, ట్రస్మా రాష్ట్ర అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి అభినందించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 14: నగరంలోని కమాన్ చౌరస్తాలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆది, సోమ, మంగళ వారాల్లో విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం పతాకా విష్కరణ, బైక్‌ర్యాలీ, పుణ్యాహవాచనం, అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠ జరుగుతాయని, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గాయత్రీదేవి సామూహిక కుంకుమార్చన, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. సోమవారం ఉదయం మనుమయాది పంచ బ్రహ్మలు, గాయత్రీ విశ్వకర్మ హవనం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అల్పాహారం ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం గాయత్రీ విశ్వకర్మ సహస్ర కమలార్చన, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదానం, అనంతరం విశ్వకర్మ భగవానుడి ఉత్సవ మూర్తుల శోభాయాత్ర జరుగుతుందని తెలిపారు.

డీజేలు వినియోగిస్తే చర్యలు

ఇల్లందకుంట, సెప్టెంబరు 14: మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనానికి డీజే సిస్టంలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజకుమార్ హెచ్చరించారు. డీజే నిర్వాహకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి ఎలాంటి డీజే అనుమతులు లేవని, ప్రశాంతవాతావారణంలో వినాయక నిమజ్జనం జరుపుకోవాలన్నారు. అనుమతి లేకుండా డీజేలు పెడితే యజమానిపై, వాహనంపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

ఘనంగా ఓనం వేడుకలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 14: నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఓనం వేడుకలను నిర్వహించారు. శనివారం రంగురంగు పూలతో తీర్చి దిద్దిన రంగవల్లులతో కేరళను తలపించే విధంగా ఓనం వేడుకలను నిర్వహించారు. కేరళ యువతుల ఆట పాటలు ఆకట్టుకున్నాయి. ఆసుపత్రి డాక్టర్లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ వాసులకు ఓనం పండగ ఎంత ప్రాముఖ్యమనే విషయాన్ని వివరించారు. కేరళ యువత నర్సింగ్ విద్యను అభ్యసించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని కొనియాడారు. మలయాళీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే ఓనం పండుగను జాతీయ పండుగగా గుర్తించడం శుభ పరిణామం అని అన్నారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ రామచందర్, డాక్టర్ వెంకటేష్, సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

●హుజూరాబాద్, సెప్టెంబరు 14: పట్టణంలోని మాంటిస్సోరి, కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఓనం వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సనాతన సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఓనం పండుగ కేరళలో అతిపెద్ద పండుగ అన్నారు. అనంతరం కేరళ సాంప్రదాయ వస్త్రాధరణతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విన్సెట్ జార్జ్, లిస్సి విన్సెంట్, గౌతమ్‌రెడ్డి, సంపత్, వాణి, గీతా షాజు, థామస్, శ్రీనివాస్‌రావు, సుధాకర్‌రెడ్డి, వాణి, అశ్విని, సరిత, రాజు, మనోజ్, సాజూ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో జన వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. 185 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాల వికాస సెంటర్ మేనేజర్ సులోచన, మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఇళ్ల చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగి ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ నిక్కత్, సుభాష్, పాషా, కృష్ణవేణి, కారోబార్ రాజశేఖర్, కో ఆర్డినేటర్స్ కె సుమలత, ఎ స్వాతి తదితరులు పాల్గొన్నారు.